సాక్షి అనంతపురం

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.5°/22.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 1,700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం నాటికి 6,065 క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన ఉన్న తుంగా ప్రాజెక్ట్‌కు వరద వస్తుండటంతో అక్కడి అధికారులు దిగువన ఉన్న టీబీ డ్యాంకు నీటిని వదులుతున్నారు. దీంతో మూడు రోజులుగా ప్రవాహం పెరుగుతూ వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులు కాగా గురువారం ఉదయానికి 1,620.43 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి మట్టానికిగాను 62.544 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు ఇన్‌ఫ్లో 6,065 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 9,964 క్యూసెక్కులుగా ఉంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,680 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నీటి నిల్వతో 20,903 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 20,289 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు



గుంతకల్లు: విజయవాడ డివిజన్‌లోని విజయవాడ – గూడూరు సెక్షన్‌లోని బాపట్ల వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా ఈ మార్గం గుండా నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్ని రైళ్లను దారిమళ్లించారు. అందులో భాగంగా మచిలీపట్నం – ధర్మవరం (07095) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 25, 27వ తేదీల్లోనూ, అక్టోబర్ 1, 2, 4, 6, 08, 9వ తేదీల్లో పూర్తిగా రద్దు చేశారు. అలాగే ధర్మవరం – మచిలీపట్నం (07096) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 26, 28, 30 తేదీల్లోనూ అక్టోబర్ 2, 3, 5, 7, 9, 10 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.


లాభసాటిగా 'ప్రకృతి వ్యవసాయం'



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కూడేరు: 'ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహిస్తోంది.'అని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె కూడేరు మండల పరిధిలోని కొర్రకోడులో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా సాగు చేస్తున్న వేరుశనగ , ఇతర పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేరుశనగ పంటకు పోషకాలు, సస్యరక్షణను ఏవిధంగా అందిస్తున్నారు? దిగుబడులు ఏవిధంగా ఉన్నాయి? అనే విషయాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. పీఎం ఈ కేవైసీని రైతులంతా చేయించుకోవాలని సూచించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా రైతులు అడుగులు ముందుకు వేయాలన్నారు. ఇంకా పంటలు నమోదు చేయించుకోని రైతులు ఈ నెలాఖరులోపు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ శంకర్‌లాల్‌నాయక్, ఏఓ విజయకుమార్, ఎంపీఈఓ సరస్వతి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు



రాప్తాడురూరల్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిహారం.. దరహాసం!

- 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'తో అన్నదాతకు ధీమా
- నాలుగేళ్లలో రూ.1,855 కోట్ల మేర పరిహారం అందజేత
- తాజాగా ఈ ఏడాది అమలుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- అనంతలో 11 పంటలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 పంటలకు వర్తింపు
- రెండు జిల్లాల్లో కంది పంటకు గ్రామం యూనిట్‌గా అమలు
- తొలిసారిగా జాబితాలో 'ఆముదం'



అనంతపురం అగ్రికల్చర్: ప్రీమియం రూపంలో రైతులపై ఏ మాత్రం భారం పడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాలుగేళ్లుగా ఉచితంగా పంటల బీమా పథకం అమలు చేస్తోంది. పెద్ద ఎత్తున పరిహారం కూడా అందిస్తూ రైతులకు ఊరటనిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఐదో ఏడాది వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద వాతావరణ బీమా, ఫసల్ బీమా అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అనంతపురం జిల్లాలో 11 పంటలకు, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 పంటలకు ఉచిత పంటల బీమా పథకాలు వర్తింపజేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ–క్రాప్, ఈ–కేవైసీ, సోషల్ ఆడిట్ ద్వారా అత్యంత పారదర్శకంగా ప్రతి రైతుకూ ప్రయోజనం కల్పిస్తున్నారు.

బీమా అమలు ఇలా..

వాతావరణ బీమా కింద గుర్తించిన పంటలకు వర్షపాతం, గాలిలో తేమశాతం, ఉష్ణోగ్రతలు తదితర వాతావరణ పరిస్థితులకు సంబంధించి ఆన్‌లైన్ డేటా ప్రకారం నిబంధనల మేరకు పరిహారం లెక్కకట్టనున్నారు. ఫసల్‌బీమా కింద గుర్తించిన పంటలకు ప్రణాళిక శాఖ అందించే పంట కోత ప్రయోగాలు, వాటి ఫలితాలకు సంబంధించి దిగుబడులను పరిగణనలోకి తీసుకుని పరిహారం అందించనున్నారు. ఇది కూడా గత ఏడేళ్లలో అత్యధిక దిగుబడులు వచ్చిన ఐదేళ్ల దిగుబడులను, ఈ ఏడాది వాస్తవంగా వచ్చిన పంట దిగుబడులతో సరిపోల్చి పరిహారం వర్తింపజేస్తున్నారు.

- అనంతపురం జిల్లాకు సంబంధించి వాతావరణ బీమాను వేరుశనగ, పత్తితో పాటు చీనీ, దానిమ్మ, టమాట పంటలకు వర్తింపజేశారు. ఈ బీమాకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. ఫసల్ బీమా కింద గ్రామం యూనిట్ (విలేజ్ ఇన్సూరెన్స్ యూనిట్)గా కందికి బీమా ఇవ్వగా, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప, ఆముదం పంటకు వర్తింపజేశారు. తొలిసారిగా ఆముదం పంటను నోటిఫై చేయడం విశేషం. వాతావరణ బీమాను రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలను 9 క్లస్టర్లుగానూ, ఫసల్‌బీమాను ఆరు క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్–3 కింద వాతావరణ బీమాకు అనంతపురం జిల్లాను మాత్రమే ఎంపిక చేసి బీమా అమలు చేసే బాధ్యతను ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఇచ్చారు.
- శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి వాతావరణ బీమా కింద వేరుశనగతో పాటు చీనీ, దానిమ్మ, టమాటకు వర్తింపజేశారు. ఇక ఫసల్‌బీమా కింద రైతులకు ఉపయోగపడేలా గ్రామస్థాయి యూనిట్ కింద కంది పంటకు ఇచ్చారు. మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, జిల్లా యూనిట్ కింద రాగి, ఆముదం పంటలకు బీమా వర్తింపజేశారు. ఇక్కడ కూడా ఆముదం పంటకు తొలిసారిగా ఉచిత బీమా పథకం వర్తింపజేశారు. వాతావరణ బీమాను శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు మరో ఆరు జిల్లాలను క్లస్టర్–2 కింద గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి అమలు చేసే బాధ్యతను అప్పగించింది. అలాగే ఫసల్‌బీమాను నెల్లూరుతో పాటు శ్రీసత్యసాయి జిల్లాను గుర్తించి హెచ్‌డీఎఫ్‌సీ ఈఆర్‌జీఓ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించారు. మొత్తంగా జిల్లా పరిధిలో 9 పంటలకు ఉచిత బీమా పథకాలు వర్తింపజేశారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పంటల బీమా ఇలా:

సంవత్సరం	లబ్ధి పొందిన రైతులు	వచ్చిన పరిహారం (రూ.కోట్లలో)
2019-20	2,46,649	266.42
2020-21	2,05,291	362.25
2021-22	4,04,461	855.55
2022-23	2,65,114	370.58

నాలుగేళ్లలో రూ.1,855 కోట్ల బీమా

గత నాలుగేళ్లలో ఉచిత పంటల బీమా కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నదాతకు పెద్ద ఎత్తున పరిహారం అందించి ధీమానిచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలో పైసా ప్రీమియం వసూలు చేయకుండా 11.21 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి రూ.1,855 కోట్ల వరకు పరిహారం జమ చేసింది. ఈ సారి కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, పంట దిగుబడులు అనుకున్నంత స్థాయిలో వచ్చే పరిస్థితి లేనందున నిబంధనల మేరకు అటు వాతావరణ బీమా ఇటు ఫసల్‌బీమా కింద రైతులకు మెరుగైన పరిహారం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

'ఆదరణ' కేసులో మరో ముగ్గురి అరెస్టు

- బాధితులుంటే ఫిర్యాదు చేయాలన్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జి. ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్రైం: 'ఆదరణ' చిట్స్ బాధితుల సంఖ్య పెరుగుతోందని నగర డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదరణ కేసులో ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, తాజాగా నాగేంద్ర, ప్రదీప్, రాయవరం మహేంద్రను అరెస్ట్ చేశామన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపుతో ఆదరణ చిట్స్ బాధితులు చాలా మంది వచ్చారన్నారు. తాజాగా 30 మంది ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటి దాకా రూ.20 కోట్లు ఆదరణ యాజమాన్యంతో పాటు డైరెక్టర్లు దుర్వినియోగం చేసినట్లు రుజువైందన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి...

ఆదరణలో చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడులు పెడితే అధిక రేటుతో వడ్డీలిస్తామని చెప్పి నల్లపాటి రామకృష్ణ, శైలజ దంపతులు ప్రజలను నమ్మించారని డీఎస్పీ తెలిపారు. దీంతో చాలా మంది ఆర్డీలు, ఎఫ్‌డీలు, ఎస్‌బీలు పెట్టారన్నారు. అలా సుమారు రూ. 27 కోట్లకు పైగా డబ్బును పోగేసుకున్న నిర్వాహకులు ఆ డబ్బును వారి స్వప్రయోజనాలకు వాడేసుకున్నట్లు తెలిపారు.ఖాతాదారుల డబ్బుతో 130 ఎకరాల పొలాలు, అపార్ట్‌మెంట్లు, పాడి పశువులు, కళాశాలలు నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. ఖాతాదారులు నిలదీస్తే తమ వద్ద డబ్బు లేదని ఇచ్చినప్పుడు తీసుకోవాలని చెప్పడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారన్నారు. బాధితురాలు ఉమాదేవితో పాటు ఇప్పటి దాకా 35 మంది ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులుంటే అనంతపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు టూటౌన్ సీఐ శివరాముడు, ఎస్ఐ నాగేంద్ర ఉన్నారు.

అరాచకాలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

- రాచానపల్లి సర్పంచ్‌పై దాడి హేయం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నాయకత్వంలో ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో అరాచకాలు, అలజడులు సృష్టిస్తే చూస్తూ ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య టీడీపీ నాయకులను హెచ్చరించారు. గణేష్ నిమజ్జనంలో రాచానపల్లి సర్పంచ్ అంజీయాదవ్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం హేయమన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో కలసి గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విద్వేషపూరితమైన ప్రసంగాలతో టీడీపీ గూండాలు, జనసేన నాయకులు రెచ్చిపోతున్నారన్నారు. ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకుంటుంటే పథకం ప్రకారం సర్పంచ్ అంజీయాదవ్‌పై దాడికి పాల్పడ్డారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ రాప్తాడులో టీడీపీ నేతలు రక్తపాతం సృష్టించారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు లోతుగా విచారణ చేపట్టి నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. రాప్తాడు మార్కెట్‌యార్డు చైర్మన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాచానపల్లిలో రూ.2 కోట్ల దాకా అభివృద్ధి పనులు జరిగాయని, టీడీపీ నాయకులు అభివృద్ధితో పోటీ పడకుండా దౌర్జన్యాలకు ఒడిగడితే మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. జెడ్పీటీసీ చంద్రకుమార్ మాట్లాడుతూ టీడీపీ అరాచక పాలన భరించలేకనే 2019లో ఆ పార్టీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీకి అదే గతి పడుతుందన్నారు. కక్కలపల్లి సర్పంచ్ కిష్టయ్య మాట్లాడుతూ అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేత ధనుంజయయాదవ్ మాట్లాడుతూ టీడీపీకి హత్య, అరాచక రాజకీయాలు కొత్తేం కాదన్నారు. టీడీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణ ప్రోద్బలంతో దేవరకొండ రామాంజినేయులు, దేవకొండ మహేష్, బద్దెల మంజునాథ్, మహేష్, దుబ్బర రమేష్, బుల్లెట్ రఫి తదితరులు దాడిలో పాల్గొన్నారని వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచులు సుబ్బిరెడ్డి, గంగాధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మూలి లోకనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంటీటీసీలు పెన్నోబులేసు, సందీప్ యాదవ్, కురుబ వెంకటేశులు, గౌస్, అఖిల భారత యాదవ సంఘం నేత ఆదినారాయణ యాదవ్, నాయకులు గోవింద్ రెడ్డి, మాదెన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు 25 వరకూ అవకాశం

రాప్తాడురూరల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, హాస్టల్ వసతి లేని మోడల్ స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని ఎన్ఎంఎంఎస్ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం, అనంతపురంలో సంప్రదించాలని సూచించారు

కూడేరులో చిరుత సంచారం

కూడేరు: మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కొండ ప్రాంతంలో చిరుత పులి గురువారం సంచరించింది. గొర్రెల కాపర్లు చిరుత సంచారాన్ని గమనించి పెద్దగా శబ్దాలు చేయడంతో గొర్రెల మంద వైపు కాకుండా పక్కకు వెళ్లి పోయింది. ఈ నెల 15న సంగప్ప నాయుడు అనే రైతు పొలంలో ఆవుదూడపై చిరుత దాడి చేసి చంపేసిన విషయం విదితమే. కొండ ప్రాంతంలోనే చిరత సంచరిస్తున్న విషయం తెలుసుకున్న గొర్రెలు, పశువుల కాపర్లు, రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చిరుత సంచరించకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద చేపట్టిన రీసర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వే, తదితర అంశాలపై సీసీఎల్ఏ సాయిప్రసాద్ గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ గౌతమి సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటి విడతలో 43 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. రెండో విడతలో 57 గ్రామాల్లో సర్వే చేపట్టామన్నారు. ఇందులో 40 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్, ఇతర ప్రక్రియలు పూర్తయ్యాయన్నారు. హద్దురాళ్ల ఏర్పాటు చివరి దశలో ఉందన్నారు. మూడో విడత కింద చేపట్టిన గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టి సకాలంలో లక్ష్యాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యుటేషన్ దరఖాస్తులు పెండింగ్ పెట్టకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్వే భూ రికార్డులశాఖ ఏడీ రూప్లానాయక్, స్పందన ఇన్‌చార్జి వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విషాదం నింపిన వినోదం

- డ్యాన్స్ చేస్తూ కుప్పకూలి యువకుడి మృత్యువాత



ప్రసాద్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: ఎంతో ఉత్సాహంగా నృత్యం చేస్తూ అందరినీ సంతోషపరుస్తున్న ఓ యువకుడిని మృత్యువు కబళించింది. వినాయక చవితి వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న అతడు.. ఉన్నట్టుండి కిందపడిపోవడం, ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. అంతవరకూ ఎంతో ఆనందంగా ఉన్న స్థానికులు ఈ హఠాత్పరిణామంతో దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఈ సంఘటన బుధవారం రాత్రి ధర్మవరం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన లక్ష్మీదేవి, నాగప్పల కుమారుడు ప్రసాద్ (25) తమ ఇంటి ముందు ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద బుధవారం రాత్రి డ్యాన్స్ చేస్తూ ఉన్నట్టుండి కింద పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

భార్య గర్భిణి..

మృతుడు ప్రసాద్ టైల్స్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య మనీషా, కూతురు సహస్ర ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఇలాంటి సమయంలో ప్రసాద్ మృతితో కుటుంబీకులు , బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ డ్యాన్స్ చేస్తున్న సమయంలో మిత్రులు తీసిన వీడియో వైరల్ అయ్యింది. అదే వీడియోలో ప్రసాద్ కిందపడిపోవడం కూడా కనిపించింది.

నేడు ఆత్మకూరులో 'జగనన్నకు చెబుదాం'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్/ఆత్మకూరు: 'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం ఆత్మకూరులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. మండల కేంద్రంలోని కనకదాస కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవుతున్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారుల, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొంటారని చెప్పారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి పరిశీలించారు.

అనంతకు చేరిన వందేభారత్

అనంతపురం సిటీ: కాచిగూడ – యశ్వంత్‌పూర్ మధ్య ప్రవేశపెట్టనున్న వందేభారత్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్‌రన్ విజయవంతమైంది. గురువారం ఉదయం 10:45 గంటలకు ఈ రైలు అనంతపురం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైల్వేస్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్, ఆర్పీఎఫ్ సీఐ రవిప్రకాశ్ ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైలు రాగానే సెల్ఫీలు తీసుకునేందుకు ప్రజలు పోటీ పడ్డారు. రైలు 10.50 గంటలకు బయలుదేరి ధర్మవరం మీదుగా యశ్వంత్‌పూర్ చేరింది.

రైలు నడిచే వేళలు ఇలా...

కాచిగూడలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుతుంది. అనంతరం మధ్యాహ్నం 2.45కు బయలుదేరి రాత్రి 11.15 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. మార్గమధ్యంలో అనంతపురం స్టేషన్‌కు ఉదయం 10.54 గంటలకు చేరుకొని 10.55కు బయలుదేరుతుంది. తిరిగి సాయంత్రం 5.40 గంటలకు వచ్చి 5.41కి బయలుదేరుతుంది.



అర్హులందరికీ 'జగనన్న చేదోడు'



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అదే విధంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని పలు సచివాలయాలను ఆయన తనిఖీ చేసి జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈడీ మాట్లాడుతూ రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న చేదోడు పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. చేదోడు నాలుగో విడత అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



కొప్పలకొండ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండలో నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ కమిటీ సభ్యులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వారు పరిశీలించారు. పలు రికార్డులు, మౌలిక వసతులు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య సిబ్బంది అందజేస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సేవలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నట్లు గమనించిన వారు హెల్త్ వెల్‌నెస్ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ జయనంద్, డాక్టర్ సుగుణ, జిల్లా నేషనల్ క్వాలిటీ అసురెన్స్ అధికారి శైలజ, పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ నాగేశ్వరరావు, సీహెచ్‌ఓ నాగమణిమాల, సూపర్‌వైజర్ గాయత్రి, ఏఎన్‌ఎం నాగవేణి, హెల్త్ అసిస్టెంట్ శివయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కన్నింగ్ కౌన్సెలర్



“నువ్వు మన కులం వాడివని చెబుతున్నా. ఆ అమ్మాయితో నీ కెందుకు...ఆ డబ్బులేవో పడేయ్.. మిగతాది నేను చూసుకుంటా. దాంతోనే విడాకులకు అప్లై చేయించి...మూడు నెలల్లో మ్యూచువల్ డైవర్స్ ఇప్పిస్తా. కోర్టుల్లో పీపీలంతా మనోళ్లే... పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా మనకు ఒక సారు ఉన్నాడు. ఆయనే నాకు ఈ ఉద్యోగం ఇప్పించాడు. నేను చెప్పినట్లు విను. అక్క మంచి చేసిందనుకుంటే నన్ను కాస్త చూసుకో”

– కులాంతర వివాహం చేసుకుని భార్యతో గొడవపడి ‘దిశ’కు వచ్చిన ఓ యువకుడితో కౌన్సెలర్‌గా వ్యవహరిస్తున్న ఓ మహిళ అన్న మాటలివి.

- ‘దిశ’లో లేడీ డాన్
- కౌన్సెలింగ్ పేరుతో పంచాయితీలు
- దంపతుల మధ్య చిచ్చుపెడుతున్న వైనం
- కానులు ముట్టజెబితే కేసు లేకుండా చేస్తానంటూ హామీ
- ‘దిశ’లో ఎక్కువ శాతం తానే డీల్ చేస్తానంటూ బీరాలు
- అడిగినంత ఇస్తే మూడు నెలల్లో మ్యూచువల్ విడాకులిప్పిస్తానని బేరం
- కోర్టులో కూడా మన సామాజికవర్గం వారే ఉన్నారంటూ భరోసా

అనంతపురం క్రైం: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘దిశ’స్టేషన్‌లో ఓ లేడీ డాన్ పాగా వేసింది. మనస్పర్థలతో కేసులు పెట్టుకుని కౌన్సెలింగ్ కోసం ‘దిశ’స్టేషన్‌కు వచ్చే దంపతుల మధ్య చిచ్చు రేపుతోంది. డబ్బులిస్తే కేసే లేకుండా చేస్తానంటూ హామీలిస్తోంది. అంతేకాదు ఏకంగా ‘దిశ’పోలీసుల తరఫునా ముడుపు ముచ్చట్లూ పెడుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో పంచాయితీలు, సెటిల్ మెంట్లు, కిరాయి హత్యలకు ఫైనాన్స్ చేయడం లాంటి కేసుల్లో ముద్దాయిగా ఉన్న ఆమె... ప్రస్తుతం కౌన్సిలర్ పేరుతో ఏకంగా ‘దిశ’స్టేషన్‌లోనే కూర్చొని దందా చేస్తోంది. కాపురాలు నిలబెట్టాల్సింది పోయి... డబ్బుకోసం కుంపటి రాజేస్తోంది. అబ్బాయి తన సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో అమ్మాయిని దూరం చేసి నీకు మరో పెళ్లి చేస్తానంటూ కథలల్లుతోంది. కాకపోతే ఈ రాచకార్యానికి రూ.లక్ష ఇవ్వాలని కోరింది. మరో రూ.లక్ష ‘దిశ’పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కోసం ఇస్తే మొత్తం తానే చూసుకుంటానని భరోసా ఇచ్చింది. ఈ మొత్తం ఈ వ్యవహారం ఆమె సంభాషణకు సంబంధించిన ఆడియో ఒకటి ‘సాక్షి’చేతికి అందింది. ఆడియో వివరాలు మేరకు...

నార్పలకు చెందిన ఓ యువకుడు కులాంతర వివాహం చేసుకున్నాడు. దంపతుల మధ్య విభేదాలొచ్చాయి. దీంతో బాధితురాలు ‘దిశ’పోలీసులను ఆశ్రయించింది. అక్కడ కౌన్సెలర్‌గా నెల రోజుల క్రితమే చేరిన ఓ లేడీ డాన్ తన ధన దాహాన్ని తీర్చుకునేందుకు ఈ వేదికను పావులా వాడుకుంటోంది. అందులో భాగంగా ఆ యువకుడిని ఓ వైపు లైన్‌లో పెట్టి మరో వైపు బాధితురాలి కుటుంబ సభ్యులనూ మచ్చిక చేసుకుంది. అమ్మాయి వాళ్లు రూ.15 లక్షల పరిహారం అడుగుతున్నారని, రూ.5 లక్షలిస్తే తాను మేనేజ్ చేస్తానని తెలిపింది. అందులో ‘దిశ’పోలీసులకు రూ.1 లక్ష ఇవ్వాలని, కులాభిమానం ఉంటే తనకూ కొంత డబ్బివ్వమని కోరింది. ‘‘ఏదేమైనా ఆతో నువ్వు విడిపోవడమే మేలు. అలాంటి ఆమెతో కాపురం చేయడం ఎప్పటికైనా రిస్క్. ఎక్కడా అమ్మాయిలు దొరకలేదని అలాంటి దాన్ని కట్టుకున్నావా?’’అంటూ ప్రశ్నలు కురిపించింది.

తన చరిత్రను గొప్పగా చెప్పుకుంటూ...

‘ఈ జిల్లాలో నా పేరు తెలియని లాయరు లేడు... కుల సంఘాల పెద్దలూ లేరు. రిమాండ్ ఖైదీని పోలీసుల సమక్షంలో చంపిన వ్యక్తి భార్యని నేను. నాపై చాలా కేసులున్నాయి. ఏ కేసైనా 6 నెలలకు మించి కోర్టులో నిలబడదు. నాకు చాలా మంది పీపీలు తెలుసు. అందరూ మనవాళ్లే. ఎలాంటి కేసైనా సరే 3, 6 నెలల్లో తెంపేస్తా. నువ్వు ఎంతిస్తావు చెప్పు.. తెంచేస్తా. రెండు కుటుంబాలను కూర్చోబెడతా? నాకెంతిస్తావు. అమ్మాయికెంతిస్తావు. లేదంటే ఇబ్బంది తప్పదు. ఆ స్టేషన్ అధికారికి మన కులమంటే పడదు. నీపై, మీ అమ్మ, నాన్నపై కూడా కేసు కట్టి లోపలేస్తాడు. మీ నాన్న కూడా నీ భార్యను వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. ఆలోచించుకో’’అంటూ సదరు యువకుడిని బెదిరించింది.

సెటిల్‌మెంట్లకు కేరాఫ్

సదరు మహిళ వ్యవహారం జిల్లాలో ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ఈ కిలాడీ లేడీ వ్యవహారాలపై గతంలోనే ‘సాక్షి’లో ఓ కథనం ప్రచురితమైంది. లేడీ డాన్ చేతిలో మోసపోయిన వారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. పంచాయితీల పేరుతో చాలా మంది అల్లరి మూకలను పోగేసి నిర్దాక్షిణ్యంగా డబ్బు దండుకున్న ట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు ఈ కిలాడీ వేషాలపై ఆరాతీస్తే అసలు విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

సమగ్రశిక్ష ఏపీసీగా నాగరాజు



రాప్తాడురూరల్: సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ)గా జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజుకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్‌పీడీ) బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రైల్లో ప్రయాణికురాలి అదృశ్యం



పూలబాయి తవార్ రాథోడ్

అనంతపురం సిటీ: షోలాపూర్–హాసన్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న బెంగళూరుకు చెందిన ఏడుపదుల వయసున్న వృద్ధురాలు పూలబాయి తవార్ రాథోడ్ అదృశ్యమయ్యారు. షోలాపూర్ నుంచి బెంగళూరుకు మనవడు శివకుమార్‌తో కలసి బుధవారం రాత్రి ఆమె బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 1.51 నుంచి 2.15 గంటల మధ్య రైలు గుంతకల్లుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఆపారు. ఆ సమయంలో పూలబాయి ఉన్నారు. ఆ తర్వాత మనువడు నిద్రలోకి జారుకున్నాడు. రైలు ధర్మవరం స్టేషన్ దాటాక మేల్కొని చూస్తూ ఆమె కనిపించలేదు. మధ్యలో స్టాపింగులు లేకపోవడంతో బెంగళూరులో రైలు దిగి, ద్విచక్ర వాహనంపై వెంటనే ధర్మవరం, అనంతపురం రైల్వేస్టేషన్లకు చేరుకుని ఆమె ఆచూకీ కోసం ఆరా తీశాడు. ఫలితం లేకపోవడంతో అనంతపురం జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరా పుటేజీలను రైల్వే పోలీసులు పరిశీలిస్తున్నారు.

పోక్సో కేసు దర్యాప్తులో సిబ్బంది పనితీరు భేష్ : ఎస్పీ



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోక్సో కేసు దర్యాప్తులో మెరుగైన పనితీరు కనబరిచి ముద్దాయికి జీవిత ఖైదు పడేలా చేసిన సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. 2018లో ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఎగ్గిడి నాగరాజు అలియాస్ లొడ్డ నాగరాజుకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా, బాధితురాలికి రూ.3లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ముద్దాయికి శిక్షపడేలా వాదనలు వినిపించిన స్పెషల్ పీపీ విద్యాపతి, పక్కా ఆధారాలతో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టిన ఏఎస్ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ శ్రీనివాసులు, కానిస్టేబుల్ పెన్షావలిని అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్బీ, డీసీఆర్బీ సీఐలు జాకీర్ హుస్సేన్, విశ్వనాథచౌదరి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో పక్కాగా నిఘా

జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100, సైబర్ క్రైం తదితర విభాగాలను గురువారం ఎస్పీ అన్బురాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పట్టణాల్లోని సీసీ కెమెరాలను జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. నగరంతో పాటు తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, పామిడి, గుత్తి మున్సిపల్ పట్టణాల్లోని శివారు ప్రాంతాలు, అవుటర్ రింగ్ రోడ్లు సైతం కవర్ అయ్యేలా కెమెరాలను సిద్ధం చేసి బైక్ రేసింగ్‌లపై నిఘా పెంచనున్నట్లు పేర్కొన్నారు. రక్షక్, బ్లూకోల్ట్స్, హైవే పెట్రోలింగ్ విభాగాలను బలోపేతం చేస్తున్నామన్నారు. పోలీస్ కంట్రోల్ రూం సీఐ దేవానంద్, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఉన్నారు.

‘చంద్రయాన్-3’ ఓ అద్భుతం

- మిషన్ సిమ్యులేషన్ పూర్తి బాధ్యత తమ బృందందే
- జేఎన్‌టీయూ(ఏ) పూర్వ విద్యార్థి డాక్టర్ సాయిచందన



సాయి చందనను అభినందిస్తున్న జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: ‘చంద్రయాన్-3 ప్రయోగంతో మనందరమూ ఓ అద్భుతాన్ని చూశాం. యావత్ ప్రపంచం గర్వించేలా చంద్రయాన్-3 విజయం సాధించింది. ఇది నవభారత విజయం. ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావడం ఎంతో గర్వంగా ఉంది’ అని జేఎన్‌టీయూ (ఏ) ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి (చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌లోని ఓ శాస్త్రవేత్త) డాక్టర్ ఎ.సాయి చందన అన్నారు. ప్రస్తుతం బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో సైంటిస్ట్ ‘సీ’గా పని చేస్తున్న ఆమెను జేఎన్‌టీయూ(ఏ)లో గురువారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణకాంతి, డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్, ఈసీఈ విభాగాధిపతి ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ ప్రొఫెసర్లు పి.రమణారెడ్డి, వి.సుమలత, అరుణ, మస్తానీ, లలితకుమారి, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం చంద్రయాన్-3 మిషన్‌లో ఇంజినీర్ల పాత్రను ఆమె వివరించారు.

కీలక పాత్ర మాదే

భూమి నుంచి చంద్రుని పైకి ఉపగ్రహం వెళ్లే మధ్యలో జరిగే నావిగేషన్ ప్రక్రియ మొదలు ల్యాండింగ్ అయ్యే వరకూ తమ బృందంలోని 30 మంది బాధ్యత వహించారన్నారు. ముందుగా తాము పరిశీలించిన తర్వాతనే ల్యాండర్‌కు ఎలాంటి సందేశమైనా పంపాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు విజయవంతం చేసేందుకు దాదాపు వెయ్యి పర్యాయాలు సిమ్యులేషన్ చేశామన్నారు. చంద్రయాన్-3 విజయంలో కీలక పాత్ర పోషించినందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నీటి జాడలున్నాయనే..

చంద్రుడి దక్షిణ ధ్రువంపై నీటి జాడలు ఉన్నాయని భావించడం వల్లనే రోవర్‌ను అక్కడ దింపినట్లు పేర్కొన్నారు. రాళ్లు, శిలలు తక్కువగా ఉండడంతో ల్యాండర్ సురక్షితంగా దిగేందుకు మార్గం సుగమమైందన్నారు. ఆ ప్రాంతంలో మంచు స్ఫటికాల రూపంలో నీటి నిల్వలు ఉన్నాయని ఇస్రో గుర్తించిందన్నారు. అందులోనూ దక్షిణ ధ్రువంపై గురుత్వాకర్షణ శక్తి చాలా తక్కువగా ఉంటుందన్నారు. అక్కడ వెలుతురు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీల్లో ఉంటాయన్నారు. ఈ కారణాల రీత్యా అక్కడ నీరు ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఇస్రో అంచనా మేరకు పది కోట్ల టన్నుల మేర నీరు ఉండొచ్చునన్నారు. నీరుంటే అక్కడ మానవ మనుగడ కూడా సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో చంద్రుడిపై పరిశోధనలకు చంద్రయాన్-3 ప్రయోగం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

నానో శాటిలైట్లదే భవిష్యత్తు

చంద్రయాన్-3 విజయవంతం చేయడంలో భారత శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయమని డాక్టర్ సాయిచందన కొనియాడారు. ఈ విజయం ద్వారా అంతరిక్ష పరిశోధనలకు 50 దేశాలు ఇస్రోతో ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. భవిష్యత్తు నానో శాటిలైట్‌లదే అవుతుందన్నారు. నానో శాటిలైట్ విప్లవానికి ఇస్రో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

గుత్తి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం గుమ్మనూరు కొట్టాలకు చెందిన శ్రీనివాసులు (19) వ్యక్తిగత పనిపై గురువార గుంతకల్లుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుంతకల్లు మండలం కమ్మ కొట్టాల వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా మార్గమధ్యంలో గుత్తి వద్ద మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాప్తాడు: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు వెల్లడించారు. మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన తలారి అహోబిలప్ప, బోయ పెద్దన్న, బింగి రాయమ్మ కొంత కాలంగా కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నారు. అందిన పక్కా సమాచారంతో గురువారం తనిఖీలు చేపట్టి 82 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

స్త్రీనిధి ద్వారా రూ.73.5 కోట్ల రుణాలు

- స్త్రీనిధి ఏజీఎం హనుమేష్‌బాబు

కూడేరు: జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.75.5 కోట్ల మేర రుణాలిచ్చినట్లు స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ బాబు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.147 కోట్ల రుణ వితరణ లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ రూ.75.5 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. స్త్రీనిధి రుణాల రికవరీకి సంబంధించి ఆటో డెబిట్ విధానంపై కూడేరులోని వైకేపీ కార్యాలయంలో యానిమేటర్లకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రుణాల రికవరీ వంద శాతం ఉండాలని ఆదేశించారు.. ఆటోడెబిట్ విధానం ద్వారా రుణాల రికవరీలో ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. ఈ విధానంపై మహిళా సంఘాల సభ్యులను చైతన్య పరచాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు అర్హత ఉన్న అన్ని సంఘాలకు స్త్రీనిధి ద్వారా రుణాలివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష వరకూ రుణం మంజూరు చేస్తామన్నారు. ఇప్పటి వరకూ మంజూరు చేసిన రుణాలకు సంబంధించి రికవరీ కూడా 92 శాతముందన్నారు. ఇందులో రూ.36 కోట్లకు ఆటో డెబిట్ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీ మద్దిలేటి, ఏపీఎం రాజశేఖర్, ఎస్‌పీఓ ఏపీఎం సుభద్రమ్మ, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ న్యాయ విభాగంలో పలువురికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌గా లింగాల లోకేశ్వరరెడ్డి, అనంతపురం జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా జి.ఉమాపతి నియమితులయ్యారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మహిళకు జైలు

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: యువకుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మహిళకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. గోరంట్ల సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన ప్రమీలమ్మ, వడ్డే శంకర్ దంపతులు. అదే గ్రామానికి చెందిన చాకలి ప్రసాద్ అక్కతో శంకర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లుగా అనుమానం పెంచుకున్న ప్రమీలమ్మ తరచూ ప్రసాద్‌తో గొడవ పడుతుండేది. గ్రామస్తుల ముందే నానా దుర్భాషలాడుతూ పరువు తీయడంతో మనస్తాపం చెందిన ప్రసాద్ 2016లో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు... ప్రసాద్ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ప్రమీలమ్మపై కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో న్యాయస్థానంలో హాజరు పరిచారు. అప్పటి నుంచి కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం అనంతపురం జిల్లా అదనపు జడ్జి శోభారాణి తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది సృజన వాదించారు.

బాల్య వివాహాల నియంత్రణ భేష్

- కలెక్టర్ గౌతమిని అభినందించిన సీఎస్ జవహర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు చేపట్టిన చర్యలు బాగున్నాయంటూ కలెక్టర్ గౌతమిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అభినందించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమం, ప్రభుత్వం పథకాలు తదితర అంశాలపై గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు చేపట్టిన చర్యలను వివరించారు. ప్రస్తుత నెలలో 19 బాల్యవివాహాలు రిపోర్ట్ కాగా, ఇందులో 11 అనంతపురం జిల్లాకు సంబంధించినవి, 8 శ్రీసత్యసాయి జిల్లాకు చెందినవన్నారు. ఇందులో రెండు కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఆరు కేసుల్లో బైండోవర్ చేశామన్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు ఫిర్యాదు అందిన వెంటనే నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పీఎం కిసాన్ ఈ–కేవైసీ ప్రక్రియ 60 శాతం పూర్తయిందని, మరో మూడు రోజుల్లో వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కలెక్టర్ చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా సీఎస్ అభినందించారు. సమావేశంలో సీపీఓ ప్రశాంత్‌కుమార్, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీపీఓ ఉమామహేశ్వరమ్మ, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఏ ఓబులమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల రెఫరీగా వెంకటేష్



అనంతపురం: ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ చెన్నైలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ‘ఏ’ ప్యానల్ రెఫరీగా కె.వెంకటేష్ ఎంపికయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన పీడీగా పనిచేస్తున్నారు. టెక్నికల్ అఫిషియల్ కోటాలో ఆయనను రెఫరీగా ఎంపిక చేశారు.

వలంటీర్ ఆత్మహత్య



రంగనాయకులు (ఫైల్)

గుత్తి: స్థానిక 22వ వార్డు వలంటీర్ రంగనాయకులు అలియాస్ బళ్లారి (31) గురువారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓల్డ్ సీపీఐ కాలనీలో నివాసముంటున్న ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు మృతి చెందారు. అందరితో స్నేహపూర్వకంగా ఉండే వారు. బుధవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా అందరితో కలసి సరదాగా డ్యాన్స్‌లూ చేశారు. గురువారం సాయంత్రం తాను ఒంటరిగా నివాసముంటున్న ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న టూటౌన్ ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రమాదేవి

అనంతపురం క్రైం: స్థానిక ప్రకాష్‌రోడ్డులో మూడేళ్ల బాలుడు ఏడుస్తూ టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ రమాదేవి కంటపడ్డాడు. బాలుడిని ఆమె స్టేషన్‌కు తీసుకెళ్లి, విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు బాలుడి ఆచూకీ కోసం ఆరా తీశారు. స్థానిక రహమత్‌నగర్‌కు చెందిన జబ్బార్ కుమారుడు అని తెలుసుకుని, బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. హెడ్‌కానిస్టేబుల్ రమాదేవిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

అర్హులందరికీ పథకాలు



అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని ఎంపీపీ హేమలత తెలియజేశారు. గురువారం మండలంలోని పి.యాలేరు గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయంలో ఆధార్ క్యాంపును పరిశీలించి, ఏ ఒక్కరికీ ఇబ్బందులు కలగకుండా సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వైస్ ఎంపీపీ నీలిమ, మండల కన్వీనర్ బాలపోతన్న, పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్త్ స్క్రీనింగ్ తనిఖీ

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశాఖ సిబ్బంది చేస్తున్న హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మేయర్ వసీం పరిశీలించారు. గురువారం 48, 50వ డివిజన్లలో జరిగిన ఇంటింటా స్క్రీనింగ్‌లో ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని స్థానిక ప్రజలకు వివరించారు. ఈ నెల 30 నుంచి జరిగే హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ సంకల్పమన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహులు

రాప్తాడు: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని మరూరు, గొల్లపల్లి గ్రామాల్లో రీసర్వేపై గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గంగలకుంట, బొమ్మేపర్తి గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. బుక్కచెర్ల, పాలచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామాంజనేయులు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వీఆర్వో రవి, సర్వేయర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్ స్ఫూర్తితోనే మహిళా బిల్లు : ఎల్ఎం ఉమ



అనంతపురం: సీఎం జగన్ స్ఫూర్తితోనే మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమా మోహన్ రెడ్డి అన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఆమె ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ వివిధ కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు, జిల్లా పరిషత్ చైర్మన్ పోస్టుల్లోనూ 50 శాతం ఇస్తామని చెప్పి, 60 శాతం మహిళలకు పట్టం కట్టబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలు, సమాన ప్రాతినిధ్యం వహిస్తూ మహిళా సాధికారిత సాధించిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు దక్కిందన్నారు.

మహిళా బిల్లు అభినందనీయం

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక టవర్ క్లాక్ వద్ద లోక్‌సభలో నారీ శక్తి వందన్ చట్టం (మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు) ప్రవేశపెట్టడంతో కేక్ కట్ చేసి, బాణా సంచా పేల్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ప్రధాన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి విశాలరెడ్డి పాల్గొన్నారు.

గణేష్ మహరాజ్ కీ జై






బంగారు వీధిలోని రాధాకృష్ణ వినాయకుడు , రాజ,రమేష్ థియేటర్ వద్ద పూజల్లో పాల్గొన్న నాయకులు

అనంతపురం కల్చరల్: వినాయక చతుర్థి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. నగరంలో కొలువుదీరిన ప్రధాన మండపాల వద్ద వినాయక నామస్మరణతో పరిసరాలు మార్మోగుతున్నాయి. గురువారం పలు చోట్ల అన్నదానాలు జరిగాయి. స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాటైన కదలికల వినాయక మంటపంలో ఉదయం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది. మధ్యాహ్నం పెద్ద ఎత్తున జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, కార్పొరేటర్ చంద్రమోహనరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పరుచూరు రమేష్ మాట్లాడుతూ శుక్రవారం ఘనంగా నిమజ్జనం చేస్తున్నామన్నారు. గురువారం అర్ధరాత్రి వరకు కమండల వినాయక వృత్తాంతాన్ని విద్యుత్ కదలికలతో చివరిసారి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మొదటిరోడ్డు, రాణీనగర్, పాతూరు, సాయినగర్ తదితర చోట్ల వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు , భక్తిగీతాలాపనలు సందడిగా జరిగాయి.

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో వెలసిన వినాయకులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. గురువారం రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదానం అనంతరం వినాయకుల దగ్గర నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చిన్మయనగర్‌లోని వినాయక మంటపాలను ఎస్ఐ ఆంజనేయులు సందర్శించి, వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




రాప్తాడు: ఛత్రపతిశివాజీ మట్టి వినాయకుడు



విద్యుత్‌నగర్‌లోని గవ్వలు, చక్రాల అలంకరణ



సప్తగిరి సర్కిల్‌లో పూజలు చేస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం



హౌసింగ్ బోర్డులో కుంకుమ భరణి వినాయకుడు



రాప్తాడు : ఇందిరమ్మకాలనీలో వినాయకుడు



కమలానగర్‌లోని డీసీఎంఎస్ ఆఫీస్ వద్ద దశావతార గణపతి



వైశ్యా హాస్టల్‌లో వరసిద్ధి వినాయకుడు



ఉమానగర్‌లో కొలువుదీరిన వినాయకుడు



లక్ష్మీనగర్‌లో...



రాప్తాడు: చిన్మయనగర్‌లో గణనాథుడు



పాతూరురెడ్డి వీధిలో అశ్వర్థనారాయణ వినాయకుడు

నారాయణస్వామి సేవలు చిరస్మరణీయం



నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

అనంతపురం కల్చరల్: అనంత రంగస్థలానికి చిరస్మరణీయ సేవలందించిన నారాయణ స్వామి ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారని మేయర్ వసీం పేర్కొన్నారు. సీనియర్ రంగస్థల నటుడు, ఎల్కేపీ మాజీ సెక్రటరీ గాజుల నారాయణస్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎల్కేపీ పద్మజ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ , వైఎస్సార్‌సీపీ నాయకుడు సైపుల్లా బేగ్, లలిత కళాపరిషత్తు అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య తదితరులు హాజరై నారాయణ స్వామి పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. తొలిసారి అనంత నాటక రంగానికి నంది అవార్డులను తీసుకొచ్చిన ఘనత ఆయనదేన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేలా కళాకారులను ప్రోత్సాహం అందిస్తామని ఎల్కేపీ నిర్వాహకులన్నారు. గురజాడ అప్పారావు స్మారక అవార్డు అందుకున్న సీనియర్ కవి నబీర సూల్‌ను సత్కరించారు. అనంతరం జిల్లా కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం, పాన్పుసీను, కాటిసీను నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణపాత్రలో జీవించిన సంగాల నారాయణస్వామి, రాయుడు, హరిశ్చంద్ర పాత్రధారి శ్రీనివాసరెడ్డి అందరినీ అలరించారు. కార్యక్రమంలో సీనియర్ నటులు సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, కుళ్లాయప్ప, అస్లాంబాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ ప్రతి చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ఔషధ ప్రతి చర్యలతో ఎదురయ్యే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటే శ్వరరావు పేర్కొన్నారు. గురువారం సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగంలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో 3వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వీక్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ మనం వాడే మందుల ద్వారా ఏమైనా ప్రతికూల చర్యలు (రియాక్షన్స్) ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలన్నారు. దీంతో పాటుగా టోల్ ఫ్రీ నంబర్ 1800 180 3024కు ఫోన్ చేస్తే నివారణ చర్యలు తెలియజేస్తారన్నారు. భారత దేశ కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ప్రతికూల ఔషధ ప్రతిచర్య పర్యవేక్షణ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బీమ సేనాచార్, ప్రొఫెసర్ డాక్టర్ వేముల శ్రీనివాసులు, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ షారోన్ సోనియా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న జనరంజక పాలనకు అండగా నిలుద్దాం

- బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ

అనంతపురం టవర్‌క్లాక్: జగనన్న జనరంజక పాలనకు అండగా నిలుద్దామని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి, పాలనను గ్రామీణ ప్రజల ముంగిటకు తెచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చడానికి మరో ముందడుగు వేసి జీవో 588 విడుదల చేశారన్నారు. తద్వారా పీడీఐ (పంచాయతీ అభివృద్ధి సూచిక) పేరుతో 17 రకాల సంపూర్ణ అభివృద్ధి (ఎస్‌డీజీ)కి సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రజల జీవన స్థితిగతుల వివరాలు సేకరించేందుకు జీవో జారీ చేయడం ఎంతో ముందుచూపు అన్నారు.

గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సంక్షేమం, వ్యవసాయం, పశుసంవర్థక, గృహ నిర్మాణం, భూములు, పొదుపు సంఘాలు, ఉపాధి మౌలిక వసతుల కల్పన లాంటి 57 కీలక అంశాల ఆధారంగా సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి వేరువేరుగా పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ) 2023–24కి గాను ప్రణాళిక రూపొందించారన్నారు. 2030కి అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితి సూచించే స్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను కొనసాగిస్తారన్నారు. వీటిని అమలుకు సంకల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు విరాళాలు అందజేత



టేబుల్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్ రావుకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ అగిశం రంగనాథ్

అనంతపురం: అనంతపురం క్రీడా గ్రామంలో రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు అక్టోబర్ 13 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి అగిశం వీరప్ప కుమారుడు డాక్టర్ అగిశం రంగనాథ్ రూ.50 వేలు చెక్కును విరాళంగా ప్రకటించారు. టేబుల్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి. మురళీధర్ రావు, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డికి గురువారం అందించారు. అనంతపురం క్లబ్ సభ్యులు డాక్టర్ ప్రవీణ్ రూ.10 వేలు , గల్లా హర్ష రూ.10 వేలు, డాక్టర్ నారాయణప్ప రూ. 5 వేలు, కిశోర్ రూ.5 వేలు చొప్పున విరాళంగా అందించారు.

జిల్లా ఎస్పీని కలిసిన జ్వాలాపురం శ్రీకాంత్



జిల్లా ఎస్పీ అన్బురాజన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కేకేఎన్ అన్బురాజన్‌ను ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు వెంకట్ శర్మ పాల్గొన్నారు.

ఆరో రోడ్డులో అల్లరి మూక హల్‌చల్

- అదుపులోకి తీసుకున్న త్రీటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం: నగరంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆరో రోడ్డులో అల్లరి మూకలు హల్‌చల్ చేశాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలానికి చేరుకొని అల్లరి మూకలను చెదరగొట్టారు. ద్విచక్ర వాహనం విషయంలో జరిగిన వివాదంతో ఇరువర్గాలు పరస్పరం దాడికి తెగబడినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణకు దిగిన 15 మందిపై కేసులు నమోదు చేసి, కొందరిని అరెస్ట్ చేసినట్లు సీఐ ధరణీ కిషోర్ తెలిపారు. మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడికి కారకులైన వారిలో శేషు, కార్తిక్, ఎరుకుల కార్తీక్, సంపత్‌లు ఉన్నారన్నారు. వీరితో పాటు కమలానగర్‌కు చెందిన యువకులు కూడా ఈ గొడవలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అనంతపురం క్రైం: నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన ఇందిర (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపిన మేరకు.. ఇందిర, మధు దంపతులు ఆరోరోడ్డులో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమార్తెకు వివాహం చేశారు. మధు కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూలి డబ్బులు మంత్తం తాగుడుకు ఖర్చు చేస్తుండడంతో భార్య పలుమార్లు అతన్ని మందలించింది. అయినా అతను మారలేదు. ఆత్మహత్యాయత్నం చేసి, కొన ఊపిరితో ఉండగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధాశ్రమాలు లేని సమాజం చూడాలి

అనంతపురం కల్చరల్: వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు లేని సమాజం చూడాలని డిప్యూటీ మేయర్ విజయభాస్కరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రాజురోడ్డులోని వైశ్యహాస్టల్ ప్రాంగణంలోని వాసవీ వృద్ధాశ్రమంలో ఐదురోజుల పాటు సాగే భక్తియోగం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోగటం విజయభాస్కరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు సాయి, సామాజిక సేవా కార్యకర్త అనిల్‌కుమార్‌రెడ్డి, సుంకర రమేష్, వృద్ధాశ్రమ అధ్యక్షులు నాగభూషణం, రెడ్డిజన సంఘ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మధు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ జెండా ఆవిష్కరణ

రాప్తాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి కావడంతో స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రమణయ్య, అధ్యక్షులు లింగమయ్య, ప్రధాన కార్యదర్శి గోవింద్ రాజులు, జిల్లా నాయకులు మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, వెంకట్ నాయుడు, రాజకుల్లాయప్ప పాల్గొన్నారు.

నేడు నగరంలో వినాయక నిమజ్జనం

- జిల్లా ఎస్పీ, మేయర్ చేతులమీదుగా వినాయక రథయాత్ర ప్రారంభం
- ఇప్పటికే భారీగా తరలివచ్చిన కళాకారులు



నగరంలోని గణపతి

అనంతపురం కల్చరల్: నగరంలో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. వాడవాడలా కొలువుదీరిన వినాయకులు సాయంత్రం నిమజ్జనానికి తరలి వెళ్లనున్నారు. ఇప్పటికే ఊరంతా సందడి నెలకొంది. జిల్లాలోనే సప్తగిరి సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు జరగనున్న విషయం విదితమే. ముగింపు వేడుకల్లో భాగంగా వినాయక రథయాత్రను సాయంత్రం 5 గంటలకు మేయర్ వసీం, జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రారంభిస్తారు. తొలుత కాషాయ ధ్వజాన్ని ఎగురవేసి సాంస్కృతిక సంబరాలు, కళారూపాల ప్రదర్శనలు ప్రారంభిస్తారు.

గణనాథుడు గంగమ్మ ఒడికి చేరేదిలా..

సప్తగిరి సర్కిల్ నుంచి వినాయకుడి నిమజ్జన యాత్ర సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పుష్పరథంలో భారీ బందోబస్తు నడుమ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి రాజురోడ్డు, ఆర్ఎఫ్‌రోడ్డు, ఆర్ట్స్‌కాలేజీ, టవర్ క్లాక్, సుభాష్‌రోడ్డు, పాతూరు గాంధీబజార్ మీదుగా చెరువుకట్ట చేరుకుంటుంది. అక్కడి నుంచి వినాయకుడిని గంగమ్మ ఒడికి తరలిస్తారు. అయితే ప్రభుత్వ సూచనల మేరకు పూజచేసిన రెండడుగుల మట్టి వినాయకుడిని మాత్రమే నిమజ్జనం చేస్తామని ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పరుచూరు రమేష్ తెలిపారు. నగరంలో కొలువైన నిలువెత్తు వినాయక ప్రతిమలను ఆలయాలకు ఇచ్చేసి మట్టి వినాయకులను నిమజ్జనం చేసేలా సూచనలందించామన్నారు. ఒకటిరెండు చోట్ల పీవోపీ గణపతుల ప్రతిమలు నిమజ్జనం చేస్తున్నారని తెలిపారు. చెరువుకట్టపైనే కాకుండా మరి కొన్ని వినాయకులు పంపనూరు, కొడిమి, పండమేరు ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి.

ఐబీ సిలబస్ కోసం ఒప్పందంపై హర్షం

రాప్తాడురూరల్: ఐబీ సిలబస్ కోసం ఒప్పందంపై వైఎస్సార్‌టీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఇంటర్నేషనల్ బక్ లారియెట్ ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు ఐబీ సంస్థలతో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అమెరికా , కెనడా లాంటి దేశాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఐబీ సిలబస్ ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రావడం అదృష్టం అని ఓబుళపతి పేర్కొన్నారు.

గొప్ప దార్శనికుడు గురజాడ అప్పారావు



గురుజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: అంటరానితనాన్ని రూపుమాపి, సమాజ స్థాపనకు కృషి చేసిన గొప్ప దార్శనికుడు గురుజాడ అప్పరావు అని రచయిత్రి శశికళ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అన్నారు. గురువారం ఐద్వా ఆధ్వర్యంలో ఒకటోరోడ్డులోని శారద బాలికల ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి నాయకురాళ్లు పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన రచనలతో సమాజాన్ని తట్టిలేపిన మహోన్నతుడు గురుజాడ అని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, నాయకురాల్లు రామాంజినమ్మ, ఉపాధ్యాయులు పుల్లమ్మ, హైమావతి, సునంద, వేళాంగిణి, ప్రజానాట్యమండలి కృష్ణవేణి, విద్యార్థినులు పాల్గొన్నారు.